ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మాజీ మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడలో మార్క్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యాలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మెరుగైన వైద్య సేవలు పొందాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, డాక్టర్ల బృందం పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి చేయూత



ఫీజు చెల్లిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినికి ఉన్నత విద్య కోసం చేయూత అందించారు. మణికొండ ఉన్నత పాఠశాల విద్యార్థిని పూజాసింగ్ గత ఏడాది ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. దీంతో ఆమెను స్థానిక శ్రీచైతన్య కళాశాలలో చేర్పించిన వీఆర్ ఫర్ సహాయోగ్ చారిటబుల్ ట్రస్టు మొదటి సంవత్సరం ఫీజు చెల్లించింది. అందులోనూ 470 మార్కులకు గాను 439 మార్కులతో సాధించి ప్రతిభ కనబర్చింది. సోమవారం రెండో సంవత్సరం ఫీజును సంస్థ ట్రస్టీ లక్ష్మణ్‌రావు, కోశాధికారి దిలీప్ కక్కడ్ చెల్లించారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: సీఎం సహాయ నిధి పేదలకు వరమని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ సాయిబాబానగర్ కాలనీకి చెందిన మూల దేవేందర్‌కు మంజూరైన రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్న వెంటనే నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోకరి సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాణిక్‌రెడ్డి యూత్ అసోసియేషన్ చేయూత అందించింది. విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అసోసియేషన్ సభ్యులు, స్థానికులు అందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు పలకలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానికులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, సాయిరామ్, నాగార్జున, నరేందర్, శ్రీకాంత్, ప్రశాంత్, ప్రవీణ్‌కుమార్, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి ,అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో కార్మికుడి మృతి

మణికొండ: ఫిట్స్ రావడంతో ఓ నిర్మాణ రంగ కార్మికుడు మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంచిరేవులలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మంచిరేవులలోని ఆదిత్య అయ్యా విల్లాస్ ప్రాజెక్ట్‌లో జి.శ్రీనివాస్ సివిల్ వర్క్స్ చేస్తున్నాడు. 10 రోజుల క్రితం తన స్వస్థలానికి వెళ్లి తిరిగి వస్తుండగా పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ వద్ద పరిచమైన ఆనంద్(42) అనే వ్యక్తి పని కావాలని కోరడంతో అతడిని తెచ్చి పనిలో పెట్టాడు. ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా అతనికి ఫిట్స్ రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 108కు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది అతడిని పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తాం

రాజేంద్రనగర్: ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారించి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవి కుమార్ అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేశారు. అనంతరం డీసీ మాట్లాడుతూ... బోనాల పండుగ నేపథ్యంలో దేవాలయాల అభివృద్ధి పనులు నిర్వహించాలని ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. దేవాలయాల వద్ద అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు సూచించామన్నారు. పరిశుభ్రత, వీధి దీపాలు, గోతులమయంగా మారిన ఉన్న రోడ్ల ప్యాచ్ వర్క్ తదితర పనులను పూర్తి చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. పండుగ సందర్భంగా భక్తులు ఇబ్బంది కలుగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులకు ఆదేశించామన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీ రవి కుమార్



ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లతో సమావేశమైన డీసీ రవి కుమార్

ఆస్తిపన్ను టార్గెట్ పూర్తి చేయాలి

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను వసూళ్లపై రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవి కుమార్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌లతో పాటు బిల్లు కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషన్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తమకు విధించిన టార్గెట్‌ను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్నారు. రోజువారి ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. మొండి బకాయిలపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని ఆదేశించారు. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయడంతో పాటు వారి ఆస్తుల జప్తునకు నోటీసులు అందించాలన్నారు. నెలవారి టార్గెట్‌ను ప్రతి ఒక్కరూ పూర్తి చేయాలని ఆదేశించారు.

చెత్తను డస్ట్‌బిన్లలోనే వేయాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్‌కు చెందిన ప్రజలు, వ్యాపారస్తులు తమ ఇళ్లతో పాటు వ్యాపార కేంద్రాల్లోని చెత్త చెదారాలను తమ వద్దకు వచ్చే చెత్త సేకరణదారులకు అందించాలని లేదా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లలో వేయాలని రాజేంద్రనగర డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ సూచించారు. సోమవారం రాంకీ సంస్థ ఆధ్వర్యంలో అందజేసిన డస్ట్‌బిన్లను ప్రధాన రహదారుల వెంట ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రధాన రోడ్లపై చెత్త చెదారాలను వేయవద్దని సూచించారు. కొందరు తమ ఇళ్లలోని చెత్తను ద్విచక్ర వాహనాలు, కార్లలో వెళుతూ రోడ్డు పక్కన పారవేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లలో మాత్రమే వేయాలని కోరారు. రాంకీ సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులపై డస్ట్‌బిన్లను ఏర్పాటు చేస్తున్న డస్ట్‌బిన్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాలనీలు పరిశుభ్రంగా మనందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ ప్రవీణ్ కుమార్, రాంకీ సంస్థ సూపర్‌వైజర్ నరసింహా రెడ్డి, జవాన్ బాబయ్య, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయిస్తున్న కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

శంషాబాద్ రూరల్: రోడ్డు విస్తరణలో పనుల్లో భాగంగా మండల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సురేష్‌రెడ్డి తెలిపారు. పెద్దషాపూర్, పాల్మాకుల ఇండస్ట్రియల్, ముచ్చింతల్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మదన్‌పల్లి, ముచ్చింతల్, గచ్చు బాయితండాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ ఏఈకి పదోన్నతి



ఏఈ సంజయ్‌ను సత్కరిస్తున్న నరేందర్‌రెడ్డి తదితరులు

మణికొండ: మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా పనిచేస్తున్న సంజయ్‌కుమార్‌కు డీఈగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా సోమవారం ఆయనను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లోను మణికొండ మున్సిపాలిటీ పరిధిలో మరింత ఉత్తమ సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాలాల నరేష్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై యువ జంట హల్‌చల్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బెంగుళూర్ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి యువ జంట హల్‌చల్ చేసింది. ద్విచక్ర వాహనంపై వెళుతూ అసభ్యంగా ప్రవర్తిస్తున్న దృశ్యాలను వెనుక వెళుతున్న ఓ వాహనదారుడు చిత్రీకరించి సోషల్ మాధ్యమంలో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. దీంతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.రాజు తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఆదివారం అర్ధరాత్రి బెంగుళూర్ జాతీయ రహదారి అయిన ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీ ప్రాంతంలోని ప్లైఓవర్ గుండా ద్విచక్ర వాహనంపై యువతీ, యువకుడు ఆరాంఘర్ చౌరస్తా మీదుగా మెహిదీపట్నం వైపు వెళ్లినట్లు గుర్తించారు. వాహన నంబర్ ఆధారంగా మోటార్ రవాణా చట్టం నిబంధన మేరకు ఫైన్ విధించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... వాహన నంబర్ ఆధారంగా సదరు యువకుడిని గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అతడిని స్టేషన్‌కు రప్పించి వాహనం ఎవరిది.. వాహనం నడిపిన యువకుడికి లైసెన్స్ ఉందా తదితర విషయాలను విచారించిన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.



వాహనంపై అసభ్యకరంగా వెళుతున్న యువతీ, యువకుడు

ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పీపరంచెరువు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు డప్పు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, తలారి ప్రేమ్‌కుమార్, భోగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని వర్సిటీలపై చర్య తీసుకోవాలి



ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేస్తున్న హరిప్రసాద్

ఏజీవర్సిటీ: ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయ డిగ్రీలు, ఇతర వ్యవసాయ కోర్సులు అందిస్తూ విద్యార్థుల జీవితాలతో అడుకుంటున్న ప్రైవేట్ వ్యవసాయ విశ్వవిద్యాలయపై చర్యలు తీసుకోవాలని భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్‌కు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి రూపావత్ హరిప్రసాద్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సోమవారం న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో ఐసీఏఆర్ డీజీని కలిసి ఫిర్యాదు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కావేరీ యూనివర్సిటి, మల్లారెడ్డి యూనివర్సిటి,అనురాగ్ యూనివర్సిటి, ఎస్ఆర్ యూనివర్సిటి, గురునానక్ యూనివర్సిటిల్లో రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు లేకుండా వ్యవసాయ సంబందిత బీఎస్సీ అగ్రికల్చర్, ఎంఎస్సీ అగ్రికల్చర్, పీహెచ్‌డీ అగ్రికల్చర్ కోర్సులలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల నుంచి రూ. 2 నుంచి రూ.4 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆయా విద్యాసంస్థలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి కల్పన కార్యక్రమాలు భేష్



జాబ్‌మేళాలో పాల్గొన్న కార్తీక్‌రెడ్డి

శంషాబాద్: స్వచ్ఛంద సంస్థలు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగాలు పొందిన యువత ఆయా రంగాల్లో అత్యున్నత స్థాయిని అధిరోహించి భవిష్యత్తులో యువతకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత చక్రధర్‌రెడ్డి, సతీష్, కొనమొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తొట్టెల ఊరేగింపు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఆషాఢమాసం బోనాల సందర్భంగా సోమవారం తొట్టెల ఊరేగింపు ఘనంగా జరిగింది. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి తొట్టెలను సమర్పించేందుకు యువకులు పెద్ద ఎత్తున ఊరేగింపులు నిర్వహించారు. ఈ సందర్భంగా గగన్‌పహాడ్‌లో నిర్వహించిన ఊరేగింపులో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

పౌష్టికాహారంతోనే ఆరోగ్య రక్షణ

శంషాబాద్ రూరల్: పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కొండా లక్ష్మణ్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి అన్నారు. ఉద్యాన యూనివర్సిటీ సహకారంతో మండలంలోని పాల్మాకుల మోడల్ స్కూల్ ఆవరణలో 'యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం- స్కూల్ ఎర్త్ క్లబ్' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఉద్యాన యూనివర్సిటీ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇలాంటి గార్డెన్లతో విద్యార్థులకు తాజా పౌష్టికాహారంతో పాటు పాఠశాల ఆవరణ పచ్చగా మారి ఆహ్లాదాన్ని పంచుతుందన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు సరైన జీవనశైలి అలవాట్లను పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. పౌష్టికాహారం, పచ్చదనంతోడైతే బాలల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజనీకుమారి, ప్రతినిధులు భగవాన్, చీనానాయక్, పంకజ్‌రెడ్డి, జీవీ.సుబ్బారెడ్డి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న వీసీ డాక్టర్ రాజిరెడ్డి

బోనాల ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

బండ్లగూడ: బోనాల ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దేవాలయాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఈ నెల 20న జరగనున్న బోనాల జాతర ఉత్సవాలపై గ్రామ పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బోనాల ఉత్సవాలకు సహకరించాలన్నారు. దేవాలయాల వద్ద ఇప్పటికే అభివృద్ధి పనులను చేపట్టామని గోతులమయంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేశామన్నారు. విద్యుత్ దీపాలు తదితర సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, యోగానందగౌడ్, జ్ఞానేశ్వర్‌గౌడ్, కె.యాదయ్య, వేణుగౌడ్, మహాలింగం గౌడ్, పాపయ్యయాదవ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా 15వ డివిజన్‌లోని మాధవీనగర్ కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. 13వ డివిజన్‌లోని వెస్టెండ్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ రహీం, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్పీలు, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

ఏజీవర్సిటీ: శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం నాన్ టిచింగ్ సిబ్బంది శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ దండా రాజిరెడ్డితో సోమవారం సమావేశమై చాలా కాలంగా అపరిష్కృతంగా సమస్యల పై చర్చించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగస్తుల మెడికల్ రీయింబర్స్‌మెంట్, టైమ్ స్కైల్ వర్కర్స్ రిటైర్మెంట్స్ గ్రాట్యుటి,ఉద్యోగుల పదోన్నతులు, రాష్ట విభజనలో రావాల్సిన పోస్టులు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు యాదయ్య, ప్రధాన కార్యదర్శి చెంచు రామయ్య, ఉపాధ్యక్షుడు కుమార్ ,రజనికాంత్, రాజేశ్వరి,దీపారాణి, అనిల్ రెడ్డి, రత్నం, ముకేష్,శ్రావణ్ పాల్గొన్నారు.



వీసీతో సమావేశమైన సంఘం నాయకులు

హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థి కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గం: హెచ్‌సీయూలోని క్యాంపస్ స్కూల్ 42వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టన్, హౌస్ లీడర్‌లను, స్పోర్ట్స్ సెక్రెటరీ, కల్చరల్ సెక్రటరీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మురళి, ఫిజికల్ డైరెక్టర్ సతీష్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం, నాన్‌టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

రాజేంద్రనగర్: ప్రమాదాలకు నిలయంగా మారిన రాజేంద్రనగర్ ఎన్ఐఆర్‌డీ కమాన్ చౌరస్తాను రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ సిహెచ్.రాజు సోమవారం సాయంత్రం సందర్శించారు. ఈ చౌరస్తాపై గతంలో ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేసేందుకు దిమ్మెను నిర్మించారు. ప్రస్తుతం ఆ దిమ్మె చౌరస్తాపై ప్రమాదభరితంగా మారిందని... రాత్రి సమయంలో ఈ దిమ్మెను గమనించని వాహనదారులు దానిని ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రతివారం ఈ చౌరస్తాలో ఒక ప్రమాదం చోటు చేసుకుంటుందన్నారు. ఈ విషయమై స్థానిక సంఘ సేవకుడు వేణు ట్రాఫిక్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీపీతో పాటు ఇన్‌స్పెక్టర్ సోమవారం ప్రమాదం జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి దిమ్మెకు రేడియం స్టిక్కర్లను వేశారు. రాత్రి సమయంలో రేడియం స్టిక్కర్లను వాహనదారులు గుర్తించి ప్రమాదం నుంచి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ కోసం ఏర్పాటు చేసి ఈ దిమ్మె విషయమై త్వరలో సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోనున్నట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు.



ఎన్ఐఆర్‌డీ కమాన్ చౌరస్తాను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రాజు

బ్రేక్ డౌన్.. ట్రాఫిక్ జాం

గచ్చిబౌలి: రద్దీ సమయాల్లో వాహనాలు రోడ్లపై బ్రేక్‌డౌన్ అవుతుండడంతో ట్రాఫిక్ జాం నెలకొంటుంది. వాహనాల రాకపోకలకు అంతరాయం కల్గుతోంది. సోమవారం ఉదయం 10.10 గంటల సమయంలో గచ్చిబౌలి ఫ్లై ఓవర్‌పై ఓ ప్రైవేట్ బస్సు బ్రేక్‌డౌన్ అవడంతో టెలికాంనగర్ నుంచి ఇందిరానగర్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఆటంకం కల్గింది. మాదాపూర్, కూకట్‌పల్లి, మెహిదీపట్నం తదితర ప్రాంతాల నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, లింగంపల్లి వైపు వెళ్లే వాహనాల రాకపోకలు మందకొడిగా సాగాయి. మరమ్మతులు చేసిన అనంతరం రాయదుర్గం ట్రాఫిక్ పోలీసులు బస్సును పక్కకు తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.